గ్రంథాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం, మే 1(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని గ్రంథాలయ గ్రౌండ్‌లో గ్రంథాలయ నిర్మాణ పనులకు గురువారం ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రంథాలయ నిర్మాణానికి సుమారు రూ. కోటి 95 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదయం శంకుస్థాపన.. మధ్యాహ్నం శిలాఫలకం ధ్వంసం

గ్రంథాలయ శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలపై కేసు నమోదైంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో గురువారం ఉదయం గ్రంథాలయ భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాగా, గురువారం మధ్యాహ్నం రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తమ అనుచరులతో కలిసి వచ్చి ఎంపీ ఈటల రాజేందర్ పేరును చిన్న అక్షరాలతో కింది వరుసలో పెట్టడం ఎంటనీ గ్రంథాలయ సిబ్బందిని ప్రశ్నిస్తూ సదరు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రంథాలయ కార్యదర్శి పి.జి.వి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

బెదిరింపులకు పాల్పడిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో గురువారం గ్రంథాలయ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తిరిగి వెళ్తున్న సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి ఎక్కడ.. అతని సంగతి చూస్తానంటూ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడినట్లు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

చాదర్‌ఘాట్, మే 1 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ శాలివాహన నగర్‌లో మహిళా సంఘాలు, సామాజిక కార్యకర్తలతో కలిసి భర్త ఇంటి ఎదుట భార్య నిరసన తెలిపింది. పాతబస్తీ ఉప్పుగూడకు చెందిన అనూష, మూసారాంబాగ్ శాలివాహననగర్‌కు చెందిన వినయ్‌కుమార్‌తో 2018లో వివాహం జరిగింది. 2020లో అంగవైకల్యం కలిగిన బాబు జన్మించాడు. అనంతరం 2022లో అదనపు కట్నం కోసం వేధిస్తూ తన కొడుకును వారి వద్దే ఉంచుకుని తనను ఇంటి నుంచి గెంటివేయడంతో మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితురాలు వివరించారు. కోర్టులో కేసు నడుస్తుందని, తిరిగి తనపైన పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆమె ఆరోపించింది. పోలీసులు తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్

హైదరాబాద్ సిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రూప్ పాఠశాలల నుంచి మొత్తం 934మంది విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో టెన్త్ పరీక్షలు రాయగా, ముగ్గురు విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించారు. 32మందికి 580కి పైగా, 78మందికి 570కి పైగా, 594మందికి 550కి పైగా మార్కులు వచ్చాయి. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శ్రమతోనే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రుద్ర మెమోరియల్ అవార్డుల కింద నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. 590కి పైగా మార్కులు వచ్చిన వారికి రూ.50వేల చొప్పున, 580కి పైగా వచ్చిన వారికి రూ.30వేలు, 570కి పైగా మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ.20వేల చొప్పున నగదును అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతియేటా 5నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థుల్లో మెరిట్ ప్రాతిపదికన 50శాతం ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్ణన్.. ఆన్ ఫీల్డ్

- క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులు పరిశీలిస్తోన్న కమిషనర్
- అంసపూర్తి పనులు చేయాలని దిశానిర్దేశం


బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

మన్సూరాబాద్, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై నూతన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. పనుల్లో జాప్యానికి కారణాలు తెలుసుకోవడంతో పాటు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. గురువారం ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ సాయినగర్ నుంచి ఆర్‌డీఓ ఆఫీస్ వరకు వరద నీటి బాక్స్ డ్రైన్, ఉప్పల్ ఎస్‌ఆర్‌డీపీ జాతీయ రహదారులపై వంతెన పనులు, బైరామల్‌గూడ వంతెన కింద క్రీడా వసతుల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లో ముంపు ముప్పు తీరేలా వర్షాకాలం లోపు వరద నీటి డ్రైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వంతెన కింద క్రీడా వసతుల కల్పన మెరుగ్గా ఉండాలన్నారు. ఉప్పల్ చౌరస్తా వద్ద వంతెన పొడిగింపు పనులు పరిశీలించిన కర్ణన్ జాప్యానికి కారణాలను అడిగి తెల్సుకున్నారు. పనుల్లో వ్యత్యాసం కారణంగా ప్రభుత్వానికి నివేదించామని, అనుమతి రాగానే పనులు చేపడతామని అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న అన్ని పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలి : సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీ కాలంలో ఎప్పుడైనా సరే కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం చొప్పున ఇవ్వాల్సిందేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, కౌన్సిల్ బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేశ్‌గౌడ్, శ్రీనూనాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

సరూర్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రాజ్యాంగం పట్ల కేంద్రం అవలంబిస్తున్న పక్షపాత వైఖరిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం బాలాపూర్‌లో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్‌లో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వై.అమరేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో మేడే వేడుకలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు

ఘనంగా మేడే

ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల దినోత్సవాన్ని గురువారం మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్, అల్మాస్‌గూడ, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, మన్సూరాబాద్, హయత్‌నగర్, కొత్తపేట, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్, సైదాబాద్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని అరుణ పతకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కొందరు కార్మికులకు దుస్తుల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కారులో మంటలు.. పూర్తిగా దగ్ధం

హయత్‌నగర్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్‌కు చెందిన మున్నంగి వేణుగోపాల్‌రెడ్డి భార్యతో కలిసి నల్గొండ జిల్లాలోని వెలిమినేడు గ్రామానికి గురువారం ఉదయం క్విడ్ కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్దకు రాగానే కారు ఇంజన్ నుంచి పొగలు రావడంతో గమనించిన వేణుగోపాల్‌రెడ్డి రోడ్డు పక్కన ఆపేశాడు. ఆ వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే హయత్‌నగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎవ్వరికి ఏలాంటి ప్రమాదం జరుగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ ఫలితాల్లో నాగార్జున విద్యార్థుల ప్రభంజనం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ విఠల్‌రెడ్డి, ఉపాధ్యాయులు

వనస్థలిపురం, మే 1(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో నాగార్జున పాఠశాల విద్యార్థులు రికార్డు స్థాయిలో ఫలితాలను సాధించి మరోసారి తమ పాఠశాల సత్తా చాటారని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు విద్యార్థులు 587 మార్కులు సాధించగా, 13 మంది విద్యార్థులు 580పైగా మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. 189 మంది విద్యార్థులు 540 మార్కులకు పైగా 90శాతం మార్కులు సాధించారన్నారు. మార్కుల విధానమైనా, గ్రేడుల విధానమైనా తమ పాఠశాలల్లో ప్రతి ఏడాదీ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 560కి పైగా మార్కులు సాధించిన 79మంది విద్యార్థులకు వనస్థలిపురంలోని పాఠశాలలో పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ జి.రజనివిఠల్ రెడ్డి, అకడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, సీ.ఏ.ఓ శేషారావు, పాఠశాల ప్రిన్సిపాళ్లు విజయ్‌కుమార్, మహేష్, రవీందర్‌రెడ్డి, మురళి, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● శ్రామికశక్తి అవార్డు ప్రదానం



గాంధీభవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐఎన్‌టీయూసీ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి షరన్‌జిత్‌సింగ్‌కు శ్రామికశక్తి అవార్డును ప్రదానం చేస్తున్న టీపీసీసీ కార్మిక విభాగం చైర్మన్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్

- ఎల్బీనగర్ (ఆంధ్రజ్యోతి)